క్లుప్తంగా

సొసైటీ ఆధ్వర్యాన పెట్రోల్ బంక్ ఏర్పాటు

నేలకొండపల్లి: రైతుల సంక్షేమం కోసమే సొసైటీ ఆధ్వర్యాన పెట్రోల్‌బంక్ ఏర్పాటు చేస్తున్నట్లు చెరువుమాధారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ దీరావత్ బాలాజీ పేర్కొన్నారు. మండలంలోని చెరువుమాధారంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని అనుమతులు తీసుకున్నాకే డీజిల్, పెట్రోల్‌ను విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ పి.రామకోటయ్య, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆటో నుంచి జారిపడి మహిళకు తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు ఆటో నుంచి జారి పడడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన గోగుల రాధ శుక్రవారం ఆటోలో ముదిగొండ మండలంలోని మాధాపురం కూలీ పనులకు వెళ్తోంది. ఈక్రమంలో గ్రామ శివారుకు వెళ్లగానే అస్వస్థతకు గురై ఆటో నుంచి ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి, ఆపై ఖమ్మం తరలించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇటీవల చికిత్స పొందుతూ ఒక గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. దీంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరచగా.. ఆమె కోసం ఎవ్వరూ రాకపోవడంతో ఓపీ పోలీసులు, ఆస్పత్రి సిబ్బంది అన్నం సేవా ఫౌండేషన్‌కు సమాచారం అందించారు. ఈమేరకు వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనపర్చుకుని బల్లేపల్లిలోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠధామం వ్యాన్ డ్రైవర్‌పై ఫిర్యాదు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కాల్వొడ్డులో గల వైకుంఠధామం వ్యాన్ డ్రైవర్‌పై అక్కడి ఇన్‌చార్జ్ అధికారులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వైకుంఠధామం వ్యాన్ కిరాయిలతో నగదును డ్రైవర్ వాడుకున్నారని, తిరిగి చెల్లించాలని అడుగితే తనపై దాడి చేశారని ఇన్‌చార్జ్ పుల్లయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను గాయపరిచిన వ్యాన్ డ్రైవర్ అన్వర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, కొన్ని నెలలుగా వైకుంఠధామంలో పని చేస్తున్న సిబ్బంది మధ్య పలు వివాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఒకరిపై ఒకరు పైఅధికారులకు ఫిర్యాదులు చేసుకుంటున్నారన్న చర్చ కేఎంసీలో జరుగుతుంది.

నేలకొండపల్లికి చేరిన ఇస్కాన్ బృందం

నేలకొండపల్లి: గీతా జయంతి సందర్భంగా ఇస్కాన్‌కు చెందిన భక్తులు చేపట్టిన సంకీర్తన పుస్తక పంపిణీ శుక్రవారం నేలకొండపల్లికి చేరుకుంది. ఇస్కాన్ ట్రావెలింగ్ సంకీర్తన పార్టీ కృష్ణ చైతన్య మూమెంట్‌ను వ్యాప్తి చేసేలా ఆధ్యాత్మిక, భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు శ్రీ కృష్ణుని నామాన్ని వ్యాప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బావమయ్య నిత్యానందు దాసు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పుష్ప–2
వినోద	ముసాఫా
సాయిరాం	విడుదల–2
ఆదిత్య	పుష్ప–2
శ్రీనివాస	మాక్స్, బచ్చలమల్లి
సినీగెలాక్సీ	యూఐ

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	34		20
బెండకాయ	28	పాలకూర	4
పచ్చిమిర్చి	38		20
కాకర	34	చుక్కకూర	4
బోడ కాకర	120		20
బీర	44	తోటకూర	4
దొండ	50		20
పొట్లకాయ	38	గోంగూర	4
చిక్కుడు	48		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	4
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	36		25
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	38		25
క్యాప్సికం	64	-ఖమ్మం వ్యవసాయం	

కండీషన్లకు కట్టుబడి..



కల్లంలో ఆరబోసిన వరి ధాన్యం

నిలువునా మోసపోతున్న రైతాంగం

- 'ప్రైవేట్' మాయజాలంలో రైతు కష్టార్జితం
- బోనస్ రాదంటూ తప్పుడు ప్రచారం
- తూకాలు, ధరల్లోనూ వ్యత్యాసాలు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

కామేపల్లి: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించాలంటే ప్రభుత్వ నిబంధనలకు లోబడి రైతులు ధాన్యం నాణ్యత ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. ఈనేపథ్యాన ఆరుకాలం కష్టపడి పండించిన పంటను విక్రయించి సొమ్ము చేసుకుందామనే సరికి ప్రైవేట్ వ్యాపారులు గద్దల్లాగా రైతుల పంట పొలాలు, కల్లాల మీద వాలి మాయమాటలు చెప్పి అందినకాడికి దోచుకుంటున్నారు. వ్యాపారుల మాయజాలంతో సరైన ధరకు పంటను అమ్ముకోలేక నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తోంది.

ధర పడిపోయిందని..

ధాన్యం ధర పడిపోయిందని.. కొనుగోలు చేసేవారు లేరని.. ప్రభుత్వం బోనస్ అందించలేదని రైతులకు చెబుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అంతేకాక తూకాలు, ధరల్లో వ్యత్యాసం ఉంటున్నా.. వారిని కట్టడి చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలేదని పలు విమర్శలకు తీవిస్తోంది. దీంతో ప్రైవేట్ వ్యాపారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా అన్నచందంగా వారి వ్యాపారం మూడు పూలు, ఆరు కాయలుగా సాగుతోంది. ఇప్పటికైనా ప్రైవేట్ వ్యాపారుల అగడాలను కట్టడి చేయకుంటే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు.

'ప్రైవేట్'కే మొగ్గు..

మండలంలోని కామేపల్లి, కొండాయిగూడెం సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యాన పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమ శాతం, నాణ్యత ప్రమాణాలు పాటించాల్సి ఉండడంతో ఎక్కువ మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకే విక్రయిస్తున్నారు. ప్రభుత్వం సూచించిన సన్న రకం ధాన్యం కాకుండా వేరే రకాలు పండించిన రైతులంతా ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రైవేట్ వ్యాపారులు అడిగిన ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

గత్యంతరం లేక..

గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన ఓ రకం ధాన్యాన్ని ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనుగోలు చేస్తామని చెప్పింది. అయితే కొందరు మిల్లు యాజమానులు కొనుగోలు చేయకపోవడంతో చేసిది ఏమీ లేక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఈనేపథ్యాన వారు పెట్టే కండీషన్లకు కట్టుబడి అమ్ముకుని నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తోంది. ఇంతా జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమి తెలియనట్లే ఉంటున్నారు. తమ అవసరాలను అనువుగా మార్చుకుని మిల్లు నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.

ముఖం చాటేసిన వ్యాపారి

గతేడాది వానాకాలం సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా నామమాత్రంగానే ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. ఈ సమయాన ఏన్కూర్ మండలానికి చెందిన ఓ వ్యాపారి కామేపల్లి మండలంలోని ముచ్చర్ల, మద్దులపల్లి, కామేపల్లి, లింగాల, పండితాపురం గ్రామాల్లో రైతుల వద్ద విరివిగా ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించేందుకు వాయిదా పెట్టాడు. కొంతమంది రైతులకు కొంత నగదు చెల్లించి మిగతా నగదుకు వాయిదా పెట్టాడు. తీరా రైతులు వాయిదా ప్రకారం ఆ వ్యాపారిని సంప్రదిస్తే రేపు మాపు అంటూ కాలం గడిపాడు. కొంతకాలం తరువాత రైతులంతా వ్యాపారి ఇంటికి వెళ్తే తాను మరో వ్యాపారంలో పెట్టుబడి పెట్టానని అవి రాగానే చెల్లిస్తానని చెప్పి ఇప్పటి వరకు చెల్లించకుండా ముఖం చాటేశాడు. ఆ వ్యాపారి చేతిలో సుమారుగా 30 నుంచి 50 మంది రైతులు సుమారుగా రూ.20 లక్షల మేర నష్టపోయినట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేట్ వ్యాపారుల ఆగడాలను ఆరికట్టాలని రైతులు కోరుతున్నారు.

మహిళలకు వృత్తి నైపుణ్యత అవసరం



విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: మహిళలకు సాంకేతిక విద్యతో పాటు వృత్తి నైపుణ్యత అవసరమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు తెలిపారు. నగరంలోని సమర్థానం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యాన మూడు నెలల పాటు ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ ముగియడంతో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ఉన్నప్పుడే అన్ని రంగాల్లో రాణించవచ్చన్నారు. దివ్యాంగుల సంస్థ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రాడ్యుయేట్స్ యూత్ అసోసియేషన్ చైర్మన్ కోడిరెక్క ఉమాశంకర్, కోశాధికారి అవులూరి సౌమ్య, వెర్సటైల్ ఐటీ సొల్యూషన్స్ మేనేజర్ కల్లెపు అఖిల, కమ్యూనికేషన్ స్కిల్స్ ట్రైనర్ సతీష్, అధ్యాపకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 31న వైరాలో జరిగే అరుణోదయ 50 ఏళ్ల ఆవిర్భావ స్వర్ణోత్సవ సభతో పాటు ప్రదర్శన, విష్ యూ హ్యాపీ న్యూ ఇయర్‌ను జయప్రదం చేయాలని అరుణోదయ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు యోగానందం కోరారు. శుక్రవారం దీనికి సంబంధించిన పోస్టర్లను ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్మిక, రైతాంగ, మహిళా, మైనార్టీ, దళిత, ఆదివాసీల పక్షాన వారి హక్కుల రక్షణకై సాగిన పోరాటాల్లో అరుణోదయ గజ్జ గట్టి, గళం విప్పి కళారూపాలను ప్రదర్శించిందన్నారు. సాయంత్రం విక్రమ్ భవన్ నుంచి కళాకారుల ప్రదర్శన, గాంధీ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తుండగా.. పలువురు ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణారావు, వై.జీవన్, గుమ్మడి సంపత్, కంకణాల శ్రీనివాస్, యశ్వంత్, నజీర్, గడ్డం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపిన ప్రదర్శన, కవాతు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గురువారం ఖమ్మంలో నిర్వహించిన ప్రదర్శన, కవాతు స్ఫూర్తి నింపడంతో పాటు భవిష్యత్తు ప్రజా ఉద్యమాలకు బాటలు వేశాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదర్శనకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది తరలివచ్చారని, ఇటీవల కాలంలో ఏ రాజకీయ పార్టీ నిర్వహించని రీతిలో భారీ ప్రదర్శనను నిర్వహించిందన్నారు. ఏడాది పొడవునా సీపీఐ శత వసంత సంబరాలను నిర్వహించనున్నామని ప్రతీ గ్రామంలో సభలు, సమావేశాలు నిర్వహించి నాటి ఉద్యమ ఘట్టాలను, కమ్యూనిస్టు పార్టీ ఎదుర్కొన్న నిర్బంధాలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

ముదిరాజ్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లు..

ఖమ్మం మామిళ్లగూడెం: ముదిరాజ్ సంఘ నూతన సంవత్సరం–2025 క్యాలెండర్లను శుక్రవారం ఖమ్మం లెనిన్‌నగర్‌లోని సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. మారబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు కాశబోయిన అనంతరాములు, పతానపు వెంకటేశ్వర్లు, పిట్టల నాగేశ్వరరావు, పిట్టల వెంకటనర్సయ్య, మత్స్య శాఖ జిల్లా అడహక్ కమిటీ చైర్మన్ మామిడి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు రావుల హన్మంతరావు, కార్పొరేటర్ బుడిగం శ్రీనివాస్, జర్నలిస్టు పెరబోయిన తిరుపతిరావు, ములకలపల్లి సంఘమేశ్వరరావు, గోల్కొండ అంజయ్య, నర్ల శేషు తదితరులు పాల్గొన్నారు.

'న్యూ ఇయర్' మన సంప్రదాయం కాదు

ఖమ్మం మామిళ్లగూడెం: హ్యాపీ న్యూ ఇయర్ అంటూ నూతన సంవత్సర వేడుకలను కేక్ కటింగ్‌లు, కేరింతలతో నిర్వహించడం మన సంప్రదాయం కాదని అవామె ఏ హింద్ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ హాఫీజ్ మహమ్మద్ జవ్వాద్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ప్రకాశ్‌నగర్‌లో గల సిద్ధికియా మసీదులో ఆయన జుమ్మా నమాజు సందర్భంగా ప్రసంగించారు. ఇస్లాం మత సంప్రదాయంలో ఇటువంటి వాటికి ఎలాంటి చోటు లేదని స్పష్టం చేశారు. దివ్యఖురాన్‌లో ప్రబోధించిన విధంగా ఇహ పరా లోకంలో మానవత్వంతో జీవించగలిగితేనే మోక్షం పొందుతామన్నారు. ఇకనైనా ఇటువంటి వేడుకలకు స్వస్తి చెప్పాలని కోరారు.

విలీన సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

తిరుమలాయపాలెం: ఈనెల 28న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే న్యూడెమోక్రసీ పార్టీల విలీనసభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీలో సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అర్థవలస అర్థభూస్వామ్య విధానం కొనసాగుతుందని, దాన్ని అంతం చేయడం కోసం ఫ్యూడల్ వ్యవస్థను రద్దు చేయాలనే మహత్తర పోరాటంలో ముందుకు సాగుతూ రెండు న్యూడెమోక్రసీ పార్టీల కలయిక జరగబోతుందన్నారు. దున్నేవాడికే భూమి నినాదంతో వ్యవసాయ విప్లవాన్ని విజయవంతం చేయాలనే ఏకైక లక్ష్యంతో ప్రతిఘటన పోరాట లైన్ ఏకైక మార్గమన్నారు. దేశంలో ప్రధాని మోదీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకం భారతదేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ డివిజన్ నాయకులు గొర్రెపాటి వీరస్వామి, పోలేపొంగు నాగయ్య, వెంకటేశ్వర్లు, పేరాల శ్రీకాంత్, పాముల మోహన్‌రావు, భాస్కర్, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

హరియాణా గవర్నర్ అభినందనలు



విద్యార్థినులను అభినందిస్తున్న గవర్నర్

ఖమ్మం సహకారనగర్: హరియాణాలో జరిగిన 51వ జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న రెజొనెన్స్ శ్రీనగర్ విద్యార్థులను ఆ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందించినట్లు పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్ రావు, కృష్ణవేణిలు తెలిపారు. జాతీయ స్థాయి సైన్స్ ఫేర్‌లో భాగంగా తమ విద్యార్థులు డి.శ్రీవల్లి, జి.గాయత్రిలు ''బేబి మానిటరింగ్ సిస్టం''ప్రాజెక్ట్‌ను ప్రదర్శించగా.. విద్యార్థినులతో పాటు గైడ్ టీచర్స్ బి.హరికృష్ణ, ఎం.జ్యోత్స్న లను గవర్నర్ అభినందించారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 11 కేవీ కొత్తగూడెం, అల్లీపురం విద్యుత్ ఫీడర్ల పరిధిలో నేడు(శనివారం) మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మమత విద్యుత్ సెక్షన్ ఏఈ చావా లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొత్తగూడెం, అల్లీపురం గ్రామాల్లో వ్యవసాయ మోటార్ల లైన్, శివాపురం, బృందావనం, చెరుకూరి లేక్ వ్యూ వెంచర్ల పరిధిలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి



సమ్మెలో మాట్లాడుతున్న నాయకులు

రఘునాథపాలెం: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న వివిధ విభాగాల సిబ్బందికి బకాయిలు చెల్లించాలని, వేతనాల కోసం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, జిల్లా కార్యదర్శి గాదె లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయం ఎదుట రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు రెండు రోజులు సమ్మెలో భాగంగా నిర్వహించిన సమ్మెలో వారికి మద్దతుగా మాట్లాడారు. 2వ పీఆర్‌సీ పరిధిలోకి పంచాయతీ కార్మికులను తీసుకురావాలని, సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని, ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పిట్టల మల్లయ్య, జి.రామ్‌దాస్, నారాయణ, మంగీలాల్, రాజగోపాల్, రాము, మధు, ఉపేందర్, ప్రవీణ్, ప్రభాకర్, శ్రీను, కళావతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోవడం అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

రఘునాథపాలెం: గత ఎన్నికలకు ముందు భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ రూ.12వేలు ఇస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని, సంవత్సరం దాటినా ఆ హామీని అమలు చేయకపోవడం అన్యాయమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వేపకుంట్లలో నిర్వహించిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమిలేని వ్యవసాయ కార్మికులు రూ.12వేలు, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న పథకాన్ని అటుకెక్కించారని విమర్శించారు. కుల, మత ఉన్మాదాలకు హిందూ మాత్రమే కారణమని బౌద్ధమతాన్ని స్వీకరించిన అంబేడ్కర్‌ను బీజేపీ నేతలు అవమానిస్తున్నారని, అలాంటి వైఖరి మార్చుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ ప్రమేయం లేకుండా చేయాలని కోరారు. గడిచిన కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఆశా కార్యకర్తల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి స్వస్తి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఝాన్సీ, మంగతాయి, మండల కార్యదర్శి లక్ష్మణ్, రామనాథం, ధరావత్ లక్ష్మణ్, శ్రీను, శంకర్, సత్యం, లక్ష్మీనారాయణ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలి



రైతులతో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

కామేపల్లి: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పింజరమడుగు గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పుల కారణంగా కల్లాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారన్నారు. అధికారులు ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజం నాగభూషణం, కృష్ణమూర్తి, బాదావత్ శ్రీనివాస్, ఉపేందర్, రామారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జానపద కళాకారుడికి సన్మానం



సతీష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురానికి చెందిన జానపద కళాకారుడు, ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరెంపుల సతీష్‌ను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. జానపద కళాకారుల సంఘానికి చేస్తున్న సేవలను గుర్తిస్తూ తన ఆటపాటలను గుర్తించిన ఆ సంఘం చైర్మన్ డాక్టర్ వెన్నెల, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కే.వీ.రమణాచారి సన్మానించారు. ఈమేరకు సతీష్‌ను గ్రామపెద్దలు దండి సురేష్, మిడకంటి చినవెంకటరెడ్డి, గణపారపు వీరయ్య, ఓరుగంటి శేషగిరిరావు, సీహెచ్.భాస్కర్ తదితరులు అభినందించారు.

డ్రెయినేజీ పూడ్చిన వారికి జరిమానా



జరిమానా రశీదు అందిస్తున్న కేఎంసీ ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని త్రీటౌన్ ప్రాంతం ప్రకాశ్‌నగర్‌లో డ్రెయినేజీ పూడ్చిన ఓ ఖాళీ స్థల యజమానికి కేఎంసీ అధికారులు శుక్రవారం జరిమానా విధించారు. 29వ డివిజన్‌లో ప్రధాన రహదారి వెంట ఖాళీ స్థల యజమాని తన స్థలాన్ని శుభ్రం చేసుకునేందుకు కేఎంసీ డ్రెయినేజీని పూడ్చినట్లు కేఎంసీ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో కేఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య స్థలాన్ని, డ్రెయినేజీని పరిశీలించి రూ.5 వేలు జరిమానా విధించారు. నగరంలో డ్రెయినేజీలను ఆక్రమించడం, పూడ్చడం చేస్తే జరిమానాతో పాటు మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు నివాళి



కామేపల్లి: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, తదితరులు



కూసుమంచిలో నివాళులర్పిస్తున్న దృశ్యం



ఖమ్మం లీగల్: నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



నేలకొండపల్లి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- **కామేపల్లి:** భారతదేశంలో ఆర్థిక సంస్కరణలతో దేశ ఆర్థిక పురోగతికి బాటలు వేసిన మహనీయుడు, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డితో ఎమ్మెల్యే శుక్రవారం కొత్తలింగాల క్రాస్‌రోడ్డులోని దివంగత రాంరెడ్డి వెంకటరెడ్డి విగ్రహం వద్ద మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రిగా ఆయన హయాంలో రూపొందించిన సమాచార హక్కు, ఉపాధి హామీ వంటి చట్టాలు దేశానికి ఎంతో విలువైనవన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, నల్లమోతు లక్ష్మయ్య, దమ్మాలపాటి సత్యనారాయణ, మాలోత్ సరిరాంనాయక్, ప్రేమ్‌కుమార్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.
- **కూసుమంచి:** భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు, జర్నలిస్ట్‌లు, పలు వర్గాలకు చెందిన వారు సంతాపాన్ని తెలియజేశారు. శుక్రవారం కూసుమంచిలో నిర్వహించిన కార్యక్రమాల్లో మన్మోహన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రెండుసార్లు ప్రధానిగా, ఆర్థిక సంస్కర్తగా ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు.
- **ఖమ్మం లీగల్:** మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి ఖమ్మం బార్ అసోసియేషన్ సంతాపం తెలిపింది. శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా.. సీనియర్ న్యాయవాదులు ప్రధానిగా, ఆర్థికవేత్తగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతికి కాంగ్రెస్ లీగల్ సెల్, ఐఏఎల్, ఐలు, టీడీపీ, బీఆర్ఎస్ లీగల్‌సెల్‌లు తమ సంతాపాన్ని తెలియజేశాయి.
- **నేలకొండపల్లి:** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మన్మోహన్‌సింగ్ సంతాపసభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీటీ చైర్మన్ సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, బాలాజీ, జెర్రిపోతుల సత్యనారాయణ, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, వంగవీటి నాగేశ్వరరావు, మైషా శంకర్, కడియాల నరేష్, తదితరులు పాల్గొన్నారు.
- **ఖమ్మంమామిళ్లగూడెం:** మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటని మాజీ టీపీసీసీ కార్యదర్శి వక్కలగడ్డ చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. అనంతరం దేశానికి మన్మోహన్ అందించిన సేవలను కొనియాడారు.